సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

ఆరిలోవ: సీజనల్ వ్యాధులపై ఆర్‌ఎంపీలకు అవగాహన కల్పించారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో హెల్త్ సిటీ జీజే ఆస్పత్రిలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. తరచూ వచ్చే వ్యాధులు, ఎముకలు, కీళ్లు, నరాలలో సంభవించే వ్యాధులపై ఆర్‌ఎంపీ వైద్యులకు అవగాహన కల్పించారు. ప్రజలను ఆయా వ్యాధుల పట్ల అప్రమత్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ వైద్యుడు శివాజీ ప్రసాద్, న్యూరో ఫిజిషియన్ డాక్టర్ మౌనిక, గ్రామీణ వైద్యుల సంఘం ప్రతినిధులు జంగం జోషి, కనకరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.2 లక్షల విరాళం



ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయకు చెక్కు అందిస్తున్న కళాశాల ప్రతినిధి

మద్దిలపాలెం: విజయవాడ వరద బాధితులకు టీఎస్సార్, టీబీకే కళాశాల యాజమాన్యం రూ.2లక్షల చెక్కును ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుకు మంగళవారం అందించింది. ఈ విరాళాలను ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపిస్తామని రిజిస్ట్రార్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పాల వ్యాన్ బోల్తా



సూర్యతేజానగర్ వద్ద డివైడర్‌పై బోల్తా పడిన వ్యాను

ఆరిలోవ: జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి సూర్యతేజానగర్ వద్ద ఓ వ్యాను బోల్తా పడింది. బీఆర్‌టీఎస్ చినగదిలి కూడలి నుంచి ఆరిలోవ వైపు మంగళవారం వేకువజామున డబుల్ రోడ్డులో వస్తున్న జెర్సీ పాల వ్యాను సూర్యతేజానగర్ మలుపు వద్ద అదుపు తప్పి, డివైడర్ పైకి దూసుకుపోయి బోల్తా పడింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వేకువజాము కావడంతో ఆ సమయంలో వాహనాల రద్దీ లేకపోవడం ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. వ్యాన్ యజమాని ఉదయం ఆ వ్యానును క్రేన్‌తో డివైడర్‌పై నుంచి తొలగించి వేరేచోటకు తరలించారు. ఇక్కడ రోడ్డు పల్లంగా ఉండటంతో పాటు మలుపు ఉండటంతో వేగంతో వస్తున్న వ్యాను డివైడర్ పైకి దూసుకుపోయిందని స్థానికులు అంటున్నారు. వాహనాల వేగాన్ని నియంత్రించడానికి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఉద్యోగులను వేధిస్తున్న అధికారిపై చర్యలు తీసుకోవాలి

మహారాణిపేట: సచివాలయ ఉద్యోగులను తీవ్రంగా వేధిస్తూ, వ్యక్తిగత దూషణకు పాల్పడుతున్న విజయనగరం మున్సిపల్ కమిషనర్ నల్లనయ్యపై చర్యలు తీసుకోవాలని విశాఖపట్నం జిల్లా వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎం.ఆనందరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్ డిమాండ్ చేశారు. నల్లనయ్య గత కొద్ది రోజుల నుంచి సచివాలయ ఉద్యోగులను తీవ్రంగా వేధిస్తూ, అవమాన పరుస్తూ హేళన చేస్తున్నారని గణేష్‌కుమార్ అన్నారు. అలాగే మీకంటే హిజ్రాలు నయం, వాళ్లు బాగా కలెక్ట్ చేస్తారని, బాగా పని చేస్తారంటూ మాట్లాడుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఉద్యోగులకు అండగా నిలబడతామని గణేష్‌కుమార్ అన్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో సచివాలయ ఉద్యోగులకు తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామన్నారు. రాష్ట్ర ట్రెజరర్ చింతకాయల బంగారురాజు, విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ సందీప్, నాయకులు బీవీ అశోక్‌కుమార్, ఎస్. సాయికృష్ణ, శరణ్య, సిద్ధార్థ వర్మ తదితరులు సంఘీభావం ప్రకటించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
7331119904, 9912440606

నాడు

జేఆర్ నగర్‌గా పేరుగాంచిన జగన్నాథరాజు కాలనీ అంటే అవార్డులకు పెట్టింది పేరు. ఇంకుడు గుంతలతో భూగర్భజలాన్ని ఒడిసిపట్టి నగరానికే ఆదర్శంగా నిలిచింది. అందమైన పార్కులతో, సుందరమైన రహదారులతో, వీధుల్లో విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా ప్రకాశించింది. కాలనీలో ఏ వీధికి వెళ్లినా పరిశుభ్రంగా కనిపించేది. కాలనీవాసుల సమష్టికృషితో అద్భుతంగా తీర్చిదిద్దిన కాలనీ ఘనకీర్తిని పొందింది.

నేడు

ఆదర్శవంతంగా వెలుగొందిన జగన్నాథరాజు కాలనీ నేడు అధ్వానంగా మారింది. రోడ్లన్నీ గోతులమయమై గందరగోళంగా మారాయి. ముఖ్యంగా యూజీడీ కోసం రోడ్లన్నీ ఇష్టారాజ్యంగా తవ్వేసి వదిలేశారు. పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉండటంతో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. నగరానికే వన్నె తెచ్చిన కాలనీ జీవీఎంసీ అధికారుల అలసత్వంతో దీనస్థితికి చేరింది. కాలనీవాసుల కృషి బూడిదలో పోసిన పన్నీరే అయింది.

ఏదీ నాటి వైభవం?

- అధ్వానంగా అవార్డుల కాలనీ
- జీవీఎంసీ నిర్లక్ష్యంతో రహదారులన్నీ గోతులమయం
- ఇదీ జేఆర్ నగర్ దుస్థితి



యూజీడీ పనుల కోసం తవ్వేసి వదిలేయడంతో గోతులమయమైన జేఆర్ నగర్ కాలనీ రోడ్లు



జేఆర్ నగర్ కాలనీలో అధ్వానంగా తయారైన ఖాళీ స్థలం

మద్దిలపాలెం : నగరంలో ఒకప్పుడు కాంతులీనిన జేఆర్ నగర్ కాలనీలో ప్రస్తుతం అడుగు పెట్టాలంటే ఆచితూచి అడుగేయాల్సిందే. లేదంటే ఏ గోతిలో పడతామో తెలియని పరిస్థితి నెలకొంది ప్రస్తుతం. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదానికి గురవడం ఖాయం. యూజీడీ కోసం రోడ్లన్నీ తవ్వేసి పూడ్చకపోవడంతో వాహనదారులు, పాదచారులు నరకయాతన అనుభవిస్తున్నారు. వర్షం కురిస్తే కాలనీ అంతా బురదమయం కావడంతో కాలు తీసి కాలు వేయలని పరిస్థితి నెలకొందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీటితో నిండిపోయిన గోతులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయని, అన్నిచోట్లా నీరు నిలిచిపోతోందని స్థానికులు వాపోతున్నారు.



జీవీఎంసీ నిర్వహణ లేక కళావిహీనంగా మారిన పార్కు

ఎక్కడి చెత్త అక్కడే

జేఆర్ నగర్ కాలనీలో ఎక్కడి చెత్త అక్కడే కుప్పలుగా పడి ఉంది. కాలనీలో కాలువలు పూడికతో నిండిపోయాయి. పారిశుధ్య సిబ్బంది రోజూ ఈ ప్రాంతంలో చెత్త సేకరించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని వాపోతున్నారు. కాలనీ చుట్టూ తుప్పలు పెరిగిపోయాయని, వాటిని కూడా తొలగించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏ తుప్పలో నుంచి ఏ విషపురుగు వచ్చి కాటేస్తుందో అని స్థానికులు హడలిపోతున్నారు.

కాలనీ మధ్యలో అధ్వానంగా ఖాళీ స్థలం

కాలనీని ఆనుకుని ఉన్న ఖాళీ స్థలం అధ్వానంగా తయారైంది. ఆ స్థలంలో చీకటిపడితే మందుబాబులు చిందులేస్తున్నారు. పగటి వేళ ఆకతాయిల ఆగడాలకు అడ్డాగా తయారైంది. ఈ స్థలంలో తాగి పడేసిన మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. చుట్టూ ఏర్పాటు చేసిన కంచె కూడా ధ్వంసమైంది. ఇక్కడకు వచ్చే ఆకతాయిలను నియంత్రించే నాథుడే కరువయ్యాడు. మరోవైపు కాలనీ ప్రవేశంలో ఏర్పాటు చేసిన చిన్నపార్కు అంధవికారంగా తయారైంది. జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఇనుప కుర్చీలు సైతం ధ్వంసమయ్యాయి. ఒకప్పుడు అద్భుతంగా సందర్శకులకు కనువిందు చేసే పార్కు ప్రస్తుతం దీనస్థితికి చేరిందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



పార్కు వద్ద విరిగిపోయిన ఇనుప కుర్చీలు

'సౌత్‌జోన్ నేషనల్ అథ్లెటిక్స్'కు కృష్ణా కళాశాల విద్యార్థి

మద్దిలపాలెం: సౌత్ జోన్ నేషనల్ అథ్లెటిక్స్ పోటీలకు డాక్టర్ వీఎస్ కృష్ణా డిగ్రీ కళాశాల బీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థి డి.వెంకటేష్ ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 5, 6 తేదీల్లో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్ మీట్‌లో ప్రతిభ కనబరిచిన వెంకటేష్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. అనంతరం రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 3000 మీ. స్టీపుల్‌చేజ్ బాయ్స్ విభాగంలో రెండో స్థానంలో నిలిచి రజత పతకం సాధించాడన్నారు. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు గుంటూరులో జరిగే సౌత్ జోన్ నేషనల్స్ అథ్లెటిక్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టుకు సెలక్ట్ అయినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్‌ను, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సంధ్యారాణిని ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ పి.జయ అభినందించారు.



వెంకటేష్‌ను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

● టమాటా కోసం భారీ క్యూ



టమాటా ధరలను నియంత్రించడానికి మార్కెటింగ్ శాఖ రైతుబజార్లలో సబ్సిడీపై విక్రయాలు ప్రారంభించింది. ఎంవీపీ రైతుబజార్‌లో మంగళవారం కిలో రూ.50 చొప్పున విక్రయించారు. హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో రూ.70, బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.80 ధర పలుకుతోంది. అయితే రైతుబజార్లలో విక్రయిస్తున్న టమాటాల నాణ్యత బాగోలేదని కొనుగోలుదారులు అంటున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఆకట్టుకున్న స్టాంపుల ప్రదర్శన

సీతంపేట : నేషనల్ ఫిలాటలీ డే సందర్భంగా హెడ్ పోస్టాఫీస్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయం ఆవరణలో మంగళవారం స్టాంపుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. వివిధ సందర్భాల్లో ప్రత్యేకంగా ముద్రించిన, అరుదైన స్టాంపులను ప్రదర్శనలో ఉంచారు. పౌర గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు ప్రదర్శన తిలకించి స్టాంపుల వివరాలు, ప్రత్యేకత తెలుసుకున్నారు. అక్కినేని శత జయంతి వేడుకల సందర్భంగా ప్రత్యేకంగా ముద్రించిన స్టాంపు, పారిస్ ఒలింపిక్స్, అయోధ్య శ్రీరామ జన్మభూమి టెంపుల్, అగ్రికల్చరల్ గూడ్స్, ఇండియా - ఒమన్ దేశాల మైత్రి, ఇండియా - ఈజిప్ట్ 75 ఏళ్ల మైత్రి సందర్భంగా పోస్టల్ శాఖ విడుదల చేసిన స్టాంప్స్ ఆకట్టుకున్నాయి. ఇక్కడ ప్రదర్శించిన స్టాంపులు వాడుకకు దొరకవని, కేవలం సేకరణకర్తలకు ప్రత్యేక ముద్రిత స్టాంపులు అందజేస్తామని పోస్టల్ సిబ్బంది వెంకటేష్ తెలిపారు. ఏ స్టాంపు ఎప్పుడు విడుదల చేశారు వంటి విషయాలు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు బాగా ఉపకరిస్తాయని తెలిపారు.



స్టాంపులను తిలకిస్తున్న విద్యార్థులు

ఆస్తి పన్ను వసూలు వేగవంతం కావాలి

జగదాంబ: ఆస్తి పన్ను వసూలు వేగవంతం కావాలని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ రెవెన్యూ ఎస్. శ్రీనివాస్ అన్నారు మంగళవారం ఆయన సూర్యాబాగ్ జోనల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సెక్రటరీలు,, ట్యాక్స్ కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల వారీగా ఆర్ఐలు, సిబ్బంది నిర్ణయించిన టార్గెట్లు తీసుకుని రెవెన్యూ వసూల్ చేసి జీవీఎంసీకి ఆదాయం పెంచాలన్నారు. పాతబకాయిలు, మొండి బకాయిదారులకు నోటీలు జారీ చేయాలన్నారు. అప్పటికీ చెల్లించని పక్షంలో ఆస్తి జప్తు నోటీసులు జారీ చేయాలన్నారు. అలాగే పన్ను చెల్లింపులు చేసే వారి నుంచి చెక్‌లు కాకుండా కమిషనర్ జీవీఎంసీ పేరుతో డీడీలు తీసుకోవాలన్నారు. గతంలో చెక్‌లు ఇచ్చి ఇప్పటికీ పన్నులు చెల్లించని వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంతో జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, ఆర్వోలు, ఆర్ఐలు తదతరులు పాల్గొన్నారు.

పార్కు వద్ద...

ఆర్టీసీ అధికారుల కక్ష సాధింపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎన్‌ఎంయూఏ జిల్లా ప్రతినిధులు

మద్దిలపాలెం: విశాఖ జిల్లా ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్య వైఖరి, కక్ష సాధింపు చర్యలపై కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం అందించినట్లు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి పి.వి.వి.మోహన్ తెలిపారు. డిపోల్లో అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని కోరామన్నారు. జిల్లాలోని అన్ని ఆర్టీసీ డిపోల్లో ఉన్న ఉద్యోగుల సంతకాలతో కూడిన మెమోరాండం అందించామన్నారు. జిల్లాలో రెండు నెలలుగా నిరసనలు చేస్తున్నా డీపీటీవో స్పందించకపోవడంతో డీపీటీవోపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరామని తెలియజేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో అసోసియేషన్ జోనల్ కార్యదర్శి ఎం.వి.ఆర్.మూర్తి, రీజినల్ చైర్మన్ ప్రాస్ రీజినల్ కార్యదర్శి బి.నీలకంఠం, డివిజనల్ కార్యదర్శి ఎ.కె.శివాజీ, వాల్తేర్ అధ్యక్ష కార్యదర్శులు పి.జి.పతి, ఆర్.వసంత రావు, మద్దిలపాలెం డిపో అధ్యక్ష కార్యదర్శులు చిన్న, ఈశ్వరరావు, అల్లు సురేష్ నాయుడు, అన్ని డిపోల కమిటీల నాయకులు పాల్గొన్నారు

బియ్యం అప్పగించి వ్యాను ఉంచేశారు

ఆరిలోవ పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు



పోలీస్ స్టేషన్ ఆవరణలో బియ్యంతో పట్టుకొన్న వ్యాను

ఆరిలోవ : ఆరిలోవ పోలీసులు ఓ వ్యక్తి నుంచి ఇటీవల పట్టుకున్న రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల విభాగం అధికారులకు అప్పగించి... ఆ బియ్యంతో పట్టుకొన్న వాహనాన్ని మాత్రం ఇంకా స్టేషన్‌లోనే ఉంచేశారు. జీవీఎంసీ 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీ ఎస్‌కేఎంఎల్ నగర్‌లో ఈ నెల 5న అర్ధరాత్రి సమయంలో వరద ప్రశాంత్ గుట్టుగా రేషన్ బియ్యం మూటలతో వేరే ప్రాంతంలో రైస్ మిల్లుకు తరలించడానికి సిద్ధమై ఆరిలోవ పోలీసులకు పట్టుబడిన విషయం తెలిసిందే. ఆయన ఇంట్లో అనధికారికంగా నిల్వ చేసిన 36 బస్తాల రేషన్ బియ్యం, వాటిని తరలించడానికి సిద్ధం చేసిన వాహనాన్ని ఎస్ఐ కృష్ణ స్వాధీనం చేసుకున్నారు. ఆ వాహనాన్ని ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. పోలీసులు ఆ బియ్యాన్ని సోమవారం పౌర సరఫరాల విభాగం అధికారులకు అప్పగించేశారు. అనంతరం ఆ వాహనాన్ని అధికారులకు అప్పగించకుండా తిరిగి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ విషయంలో పోలీసుల తీరుపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని పక్కదోవ పట్టించిన వారిపైన, ఆ బియ్యాన్ని తరలించే వాహనాలపైన పౌర సరఫరాల విభాగం అధికారులు కేసులు నమోదు చేయాల్సి ఉంది. ఆ వాహనాలను సీజ్ చేసి వారి ఆధీనంలో ఉంచుకోవాల్సి ఉంది. కానీ ఇక్కడ పోలీసుల ఆధీనంలో ఆ వాహనాన్ని ఉంచడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుముఖం

ఎంవీపీ కాలనీ : నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణపై ఎంవీపీ కాలనీలోని మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదానికి గురైన కారును ట్రాలీ అవుట్‌లెట్‌తో ఎంవీపీ కాలనీతోపాటు నగరంలోని మద్దిలపాలెం, సిరిపురం, బీచ్‌రోడ్డు, ఎన్ఏడీ వంటి పలు ప్రాంతాల్లో ప్రదర్శించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తొలుత ఎంవీపీ కాలనీ ట్రాఫిక్ సీఐ కేఎస్ఎన్‌వీ ప్రసాద్ మెడికవర్ హాస్పిటల్ ప్రాంగణంలో ట్రాలీని జెండా ఊపి ప్రారంభించారు. ట్రాఫిక్, రోడ్డు సేఫ్టీ, వాహన సేఫ్టీకి అనుగుణంగా నగరవాసులు ప్రమాదాలు నివారించేందుకు అవసరమైన నిబంధనలు పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజా చైతన్యంలో భాగంగా సామాజిక బాధ్యతగా మెడికవర్ హాస్పిటల్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడాన్ని అభినందించారు. ఆస్పత్రి ఎంవీపీ కాలనీ సెంటర్ హెడ్ డాక్టర్ అరుణ్‌కుమార్‌తోపాటు డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ వినయ్ భూషణ్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాలీ అవుట్‌లెట్‌తో అవగాహన కల్పిస్తున్న సీఐ, మెడికవర్ డాక్టర్లు

డిప్యూటీ సీఈవోకు ఘనంగా వీడ్కోలు

మహారాణిపేట : నిబద్ధతతో పని చేసే అధికారులకు ఎప్పుడు గుర్తింపు ఉంటుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అన్నారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో జిల్లా ప్రజా పరిషత్ డిప్యూటీ సీఈవోగా, సీఈ వో (ఇన్‌చార్జి)గా పనిచేసి శ్రీకాకుళం బదిలీ అయిన డి.సత్యనారాయణ వీడ్కోలు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండేళ్ల క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసి బదిలీపై ఆయన శ్రీకాకుళం జిల్లాకు వెళ్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయనను సుభద్ర సత్కరించారు. రెండేళ్లలో తనకు అన్ని విధాల సహకరించిన సత్యనారాయణకు ధన్యవాదాలు తెలిపారు. పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్. సత్తిబాబు మాట్లాడుతూ ఉద్యోగుల పదోన్నతుల్లో, బదిలీల్లో, కారుణ్య నియామకాల్లో నిబంధనలకు లోబడి పని చేయడం సంతోషం కలిగించే విషయమన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా డీపీవో శ్రీనివాసరావు, ఉద్యోగ సంఘం నాయకులు మూర్తి, త్రినాథ్, మధు, రాధ, జిల్లా పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణను సత్కరిస్తున్న చైర్‌పర్సన్ సుభద్ర

మహాలక్ష్మిగా దుర్గాదేవి

వేడుకగా శరన్నవరాత్రి మహోత్సవాలు



చండికాదేవి ఆలయంలో సుందరాకాండ పారాయణ చేస్తున్న మహిళలు

ఎంవీపీకాలనీ: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆరో రోజు దుర్గాదేవి మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. కరకచెట్టు పోలమాంబ ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. అమ్మవారికి కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆలయ ఈవో కె.గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

చండికాదేవి ఆలయంలో..

ఎంవీపీ కాలనీ సెక్టార్-4లోని శ్రీ చండికాదేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. నవరాత్రి వేడుకల్లో భాగంగా మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో మహిళ భక్తులు సుందరకాండ ధ్యానశ్లోక పారాయణం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పొట్టి రమణ, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సత్యసాయి ప్రేమసదన్‌లో..

ఎంవీపీ కాలనీ సెక్టార్-8లోని శ్రీ సత్యసాయి ప్రేమ సదన్‌లో అమ్మవారు లక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. వేడుకల్లో భాగంగా సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



సత్యసాయి ప్రేమ సదన్‌లో లక్ష్మీదేవిగా అమ్మవారు



కరకచెట్టు పోలమాంబ ఆలయంలో మహాలక్ష్మిగా దుర్గాదేవి

పోర్ట్ ఆస్పత్రిని ప్రైవేట్‌పరం చేయొద్దు

దాబాగార్డెన్స్: పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణ చర్యలు తక్షణమే నిలుపుదల చేసి పోర్టు సొంత నిధులతో అభివృద్ధి చేయాలని విశాఖపట్నం పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. జగదాంబ జంక్షన్ సమీపాన ఎస్‌వీఆర్ భవన్‌లో అఖిలపక్ష కార్మిక సంఘాలు సమావేశమయ్యాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి బీసీహెచ్ మసేన్, హెచ్ఎంఎస్ యూనియన్ నాయకుడు మంగయ్యనాయుడు, సిటు ఆర్గనైజింగ్ కార్యదర్శి వి. రామలింగేశ్వర రావు, వీడీఎల్‌బీ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జక్కన సత్యనారాయణ, సీఎఫ్‌టీయూఐ జాతీయ ప్రధాన కార్యదర్శి కె. కనకారావు మాట్లాడుతూ పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రి 150 పడకల సామర్థ్యంతో నిర్మించి ప్రస్తుతం 80 పడకలతో సమర్థవంతంగా పోర్టు అండ్ డాక్ అధికారులు, ఉద్యోగులు, రిటైర్ అయిన కార్మికులు, ఫ్యామిలీ పెన్షనర్లు, పూల్ కళాసీలు, సీహెచ్‌డీ క్యాజువల్ కార్మికులు, సీఐఎస్ఎఫ్ ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులకు దశాబ్దాల తరబడి 40 వేల కుటుంబాలకు సేవలందిస్తుందన్నారు. అటువంటి పోర్టు ఆస్పత్రిని పీపీపీ పద్ధతిలో మల్టీ డిసిప్లినరీ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిగా 300 పడకలతో ప్రైవేట్‌కు కట్టబెట్టాలనే నిర్ణయాన్ని పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఆస్పత్రి ప్రైవేట్‌పరం అయితే కార్మికులు, ఉద్యోగుల కుటుంబాలు ఆరోగ్య భద్రత కోల్పోవలసి ఉంటుందన్నారు. పీపీపీ పద్ధతిలో ప్రైవేట్‌కి ఇవ్వొద్దని, నిరంతరం లాభాలతో నడుస్తున్న విశాఖ పోర్టు సొంత నిధులతోనే పోర్టు ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న నాయకులు

మాతృ మరణాలు సంభవించరాదు

మహారాణిపేట: జిల్లాలో మాతృ మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అన్నారు. మాతృ మరణాలపై మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం జూలై నుంచి సెప్టెంబర్ వరకు జిల్లాలో 4 మాతృ మరణాలు సంభవించాయని, వీటిలో రైల్వే న్యూకాలనీ పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో ఒకటి, స్వతంత్ర నగర్ పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో ఒకటి, బుచ్చిరాజుపాలెం పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో ఒకటి, దుర్గా బజార్ పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో ఒకటి సంభవించాయన్నారు. గర్భిణులకు సమయానుకూలంగా వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించటం, పోషకాహారం తీసుకోవాలని అవగాహన కల్పించాలన్నారు. రక్తహీనత ఉంటే వారికి ఐరన్ ఫోలిక్ టాబ్లెట్లు ఇవ్వడం, హైరిస్క్ గర్భిణులను గుర్తించి డాక్టర్ల వద్దకు తీసుకెళ్లి వైద్యం అందేటట్లు చూడాలని తెలిపారు. గుండె జబ్బులు ఉన్నవారిని గుర్తించి వెంటనే రిఫరల్ ఆస్పత్రికి తరలించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఆస్పత్రి సమన్వయ అధికారి డాక్టర్ శంకర్ ప్రసాద్, వివిధ విభాగాల అధికారులు డాక్టర్ బి.ఉమావతి, కేజీహెచ్ గైనిక్ విభాగాధిపతి డాక్టర్ కె.వి.ఎస్.ఎం. సంధ్యాదేవి, గైనకాలజిస్ట్, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషా ప్రసాద్, వైద్యులు డాక్టర్ శ్రవణ్, డాక్టర్ జి.వి.గణేష్, డాక్టర్ సి.బి.నాయుడు, వివిధ విభాగాలకు చెందిన ఎస్.జయదేవి, ఐ.మనోరమ, 108 జిల్లా మేనేజర్ వి.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ ఈస్ట్
9912220751
Office mail : sakshiadvtvsp@gmail.com